సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ప్రజలతో మమేకమవుతూ..

నాయకుడంటే ప్రజల కష్టసుఖాలు తెలిసిన వాడై ఉండాలి... సాయం కోరి వస్తే స్పందించి వారికి అండగా నిలవాలి...ఇదే తోవలో ప్రయాణిస్తున్నారు విశాఖ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతూ వారితో మమేకమవుతున్నారు. వైద్యశిబిరాలు, సామాజిక కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- వైద్యశిబిరాలు, సొంత నిధులతో పింఛన్ల అందజేత
- గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల్లోకి ఆడారి ఆనంద్‌కుమార్


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్


గుండె వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఆనంద్ కుమార్


వాటర్ ప్లాంట్‌ను ఆధునీకీకరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ...వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారు ఆడారి ఆనంద్‌కుమార్. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు తన సొంత నిధులు ఖర్చు చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారు.

గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో...

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేరువయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకుంటున్నారు. పలు సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు.

సొంత నిధులతో పింఛన్లు

సాంకేతిక కారణాల వల్ల అర్హత ఉన్నా పింఛన్లు రాని వారికి ఆయన అండగా నిలుస్తున్నారు. తన సొంత నిధులతో ప్రభుత్వ పింఛను వచ్చే వరకు నగదు అందజేస్తున్నారు. ప్రస్తుతం 48 మందికి పింఛన్లు అందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 6 లక్షలు దీని కోసం వెచ్చించారు.

విస్తృతంగా వైద్య శిబిరాలు

పశ్చిమ నియోజక వర్గంలోని పలు వార్డుల్లో ఆడారి తులసీరావు ట్రస్ట్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు కంటి వైద్య శిబిరాల ద్వారా సుమారు 710 మందికి సేవలందించారు. వీరిలో 180 మందికి శస్త్ర చికిత్సలు, 254 మందికి కళ్లద్దాలు అందించారు. పలు వార్డుల్లో గుండె వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 2డి ఎకోతో పాటు ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సుమారు 829 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు సొంత నిధులతో శస్త్రచికిత్సలు, వైద్యం అందిస్తున్నారు.

సొంత నిధులతో ఇళ్ల నిర్మాణాలు

కష్టమని వచ్చిన వారికి సాయమందిస్తున్నారు. జీవీఎంసీ 63,62వ వార్డులో రూ1.20 లక్షలతో ఇళ్లకు మరమ్మతులు చేపట్టారు. అలాగే 59వ వార్డులో ములగాడ హౌసింగ్ కాలనీలో వాటర్ ప్లాంట్ మూలన పడి ఉంది. ఈ విషయం ఆయన దృష్టికి రాగానే రూ.45వేలు మంజూరు చేసి మరమ్మతులు చేశారు. దీంతో ఈ ప్రాంత వాసులకు మినరల్ వాటర్ అందుబాటులోకి వచ్చింది. 62వ వార్డులో రెండు ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు వెచ్చిస్తున్నారు. దీంతో ఈ ప్రాంత వాసులంతా నాయకుడంటే ఇలా ఉండాలని కొనియాడుతున్నారు.

ఎర్నిమాంబ ఆలయ నిర్మాణం

విశాఖ ప్రజల ఆరాధ్య దైవమైన జ్ఞానాపురంలో ఎర్నిమాంబ ఆలయాన్ని రూ.35 లక్షలతో కట్టించారు. ముందు షెడ్ నిర్మాణానికి రూ.16లక్షలు వెచ్చిస్తున్నారు.

క్రీడాకారులకు భరోసాగా...

జీవీఎంసీ 62వ వార్డుకు చెందిన బి. హర్షిత జాతీయ బాక్సింగ్ పోటీలకు వెళ్లేందుకు రూ.80వేలు అందించారు. ఆనంద్ ఇచ్చిన భరోసాతో ఆమె సిల్వర్ మెడల్ గెలుచుకుని వచ్చింది. క్రీడల్లో రాణిస్తున్న వారిని తానున్నానంటూ ప్రోత్సహిస్తున్నారు.

సీఎం జగన్ స్ఫూర్తితో..

పేదలకు మేలు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులు నాలో స్ఫూర్తి నింపాయి. నేను కూడా నా నియోజకవర్గ ప్రజలకు అండగా నిలవాలని వారితో మమేకం అవుతున్నాను. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలిసినప్పుడు వారి స్పందన చూస్తే నాలో మరింత ఉత్సాహం వస్తోంది. నాయకులు, కార్యకర్తల సలహాలు సూచనలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాం. ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం దృష్టి సారి స్తున్నాను. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. ప్రతీ ఓటరుకు ఆడారి ఆనంద్ కుమార్ చేరువ కావడమే లక్ష్యంగా పని చేస్తున్నాము. పారిశ్రామిక ప్రాంతంతో పాటు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఏర్పాటు చేశారు. మర్రిపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం సమయంలో అందుబాటులో ఉంటాను.

– ఆడారి ఆనంద్ కుమార్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త

క్లుప్తంగా

మల్కాపురం మహిళ అరుణాచలంలో మృతి


దేవేశ్వరి(ఫైల్)

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రెడ్డివీధి ప్రాంతానికి చెందిన పిలక దేవేశ్వరి అరుణాచలం పుణ్యక్షేత్రంలో మరణించారు. రెండు రోజుల కిందట తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి కుటుంబ సభ్యులతో వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం అరుణాచలంలో స్వామిని దర్శించుకుని తిరిగి ప్రయాణంలో ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆమెను దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా.. మార్గమధ్యలో ఆమె మృతి చెందారు. దేవేశ్వరి భర్త పిలక రామ్మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ 63వ వార్డు ఇన్‌చార్జిగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఇదే వార్డు నుంచి ఆయన కార్పొరేటర్‌గా పోటీ చేశారు. ఆమె మృతదేహాన్ని అక్కడి నుంచి మల్కాపురం తీసుకొస్తున్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్, పలువురు కార్పొరేటర్లు ఆమె మృతికి సంతాపం తెలిపారు.

శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

మర్రిపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలిచ్చారు. అధికారుల వెంట అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో ప్రేమసమాజం అభివృద్ధి

దాబాగార్డెన్స్: అందరి సహకారంతో ప్రేమ సమాజం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు బుద్ధ శివాజీ పేర్కొన్నారు. ప్రేమ సమాజం నూతన కమిటీ బుధవారం ప్రేమసమాజంలో పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా బుద్ధ శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం 93వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందని, తాను ఉపాధ్యక్షుడిగా సేవలందించానని, ఇప్పుడు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఇది పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారందరూ ప్రేమసమాజం అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రేమసమాజంలో నిరాశ్రయులు, అనాథలు 300 మంది వరకు ఉన్నారని, కోవిడ్ సమయంలో ఏ ఒక్కరూ చనిపోకుండా చూసుకున్నామని, అది ప్రేమ సమాజం గొప్పతనంగా పేర్కొన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా గోశాల నిర్వహణ చేపడుతున్నామన్నారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షునిగా మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నరసింహమూర్తి, గౌరవ కార్యదర్శిగా కె.హరిమోహనరావు, గౌరవ కోశాధికారిగా ఎంవీవీకే గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా వి.మోహన్‌రావు, వి.కె.సురేష్‌కుమార్, ఎస్.గౌరీ ప్రసాదరావు పలువురు సభ్యులచే ప్రముఖ వైద్యుడు విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రేమసమాజం పూర్వ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం, వేగి సత్యనారాయణ, ఉప్పల భాస్కరరావు, బొడ్డేటి తాతారావు, ఎస్.అప్పలరాజు, శరగడం సత్యనారాయణ, వైఎస్ జగన్, డాక్టర్ బీఎం నాయుడు పాల్గొన్నారు.

సంపత్ వినాయకుని హుండీల లెక్కింపు

సీతమ్మధార: ఆశీలమెట్టలో కొలువైన సంపత్ వినాయగర్ ఆలయం హుండీలను బుధవారం దేవదాయ శాఖ తనిఖీదారుడు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 25 రోజులకు గానూ రూ.17,03,494, 11 గ్రాముల బంగారం, 122 గ్రాముల వెండి, 61 యూఎస్‌ఏ డాలర్లు, 10 కెనడియన్ డాలర్లు, 1002 ఖతార్ రియాల్, 20 మలేషియా రింగిట్, 30 యెన్‌లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపు చేపట్టారు.

ధోబీ ఘాట్‌లో వసతులు కల్పించాలని వినతి


బెహరా భాస్కరరావుకు వినతి పత్రం అందిస్తున్న రజక సంఘం నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్ జనతా కాలనీకి చెందిన శ్రీ పైడి మాంబా రజక సేవా సంఘం సభ్యులు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును బుధవారం కలిశారు. ధోబీ ఘాట్‌కు ప్రహరీ , మంచినీటి బోరు బావి, వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కంపర సత్తిబాబు, రజక సంఘం గౌరవ అధ్యక్షుడు తోకాడ రాము, అధ్యక్షుడు యాలసపు అప్పలరాజు, ఉపాధ్యక్షుడు చీపురుపల్లి గంగాధర్, కార్యదర్శి నారు లక్ష్మణరావు, కోశాధికారి కొండవలస కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'సురక్ష'

గోపాలపట్నం: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు పరిధిలోని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. అర్హులైనా వారందరికీ ప్రభుత్వ పథకాలు అందివ్వాలని సూచించారు. సచివాలయాల్లో నిర్వహించే సమావేశాలకు అందరూ హాజరయ్యే విధంగా గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు, వారి ఇబ్బందులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 91, 92 వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, క్లస్టర్ కన్వీనర్ గేదెల మురళీ కృష్ణ, ఊటపల్లి గోవిందు, కాళ్ల వీర్రాజు.ఇ. శ్రీలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

14న జోన్-5లోని దుకాణాలు, మండపాలకు వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 40 నుంచి 60 వార్డుల్లో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్‌సైడ్ మార్కెట్లకు జూలై 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలంపాట జరుగుతుందన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వాణిజ్య సముదాయంలోని 8, 16, 26, 48, 55, 56, 58 నంబర్ల దుకాణాలు.. సుబ్బలక్ష్మీనగర్ వాణిజ్య సముదాయంలోని 3, 4, 5, 7, 8, 9, 10, 13, 14 నంబర్ల దుకాణాలు.. నరవ రోడ్డు వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 2.. సంజీవయ్య కాలనీ వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 1, 2.. ములగాడ వాణిజ్య సముదాయంలోని 4, 5 దుకాణాలు, అశోక్‌నగర్ వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 3.. 44వ వార్డులోని షాదీఖానా(కల్యాణ మండపం), 51వ వార్డులోని మాధవ స్వామి కల్యాణ మండపం(మూడేళ్ల కాల పరిమితికి), గొల్లలపాలెం, పల్లివీధి రోడ్డు, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం సైడ్ మార్కెట్లు, జనతా కాలనీ మార్కెట్‌కు(ఏడాది కాలానికి) వేలం వేస్తామని చెప్పారు. దీనిలో పాల్గొనే వారు ధరావత్తు మొత్తం డీడీ రూపంలో చెల్లించాలని, ఎస్సీ రిజర్వ్ కేటగిరీ వారు తహసీల్దార్ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆధార్, పాన్ కార్డులు అందించాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు వివరాలకు జోన్-5 కార్యాలయంలో పనిదినాల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని జెడ్సీ కోరారు.

బోరు బావి ప్రారంభం


బోరు బావిని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గౌరీనగర్ రిక్షా కాలనీలో ఏర్పాటు చేసిన బోరు బావిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బోరు బావికి మోటారు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత వాసులకు నీటి సమస్య తీరిందన్నారు. రహదారుల అభివృద్ధికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల యోచనను విరమించుకోవాలి


సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

సింథియా: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను విరమించుకోవాలని విశ్వకర్మ విశాఖ ఇండస్ట్రియల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మల్కాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు పంచదార్ల అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను విరమించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

నేడు పెద్దింటమ్మ పండగ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధిలోని పెద్దింటమ్మ అమ్మవారి పండగను (భోనాల పండగ) గురువారం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయం వద్ద పసుపు,కుంకుమలతో పూజలు చేయనున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో వైభవంగా ఊరేగిస్తారు. పూజా కార్యక్రమంలో మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ పెద్దలు, పలు కుల సంఘాల పెద్దలు పాల్గొననున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో టీడీపీ యాత్ర

సెల్ఫీలకే పరిమితమైన నాయకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో భవిష్యత్తుకు భరోసా పేరిట బుధవారం ఉదయం ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టారు. జింక్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మల్కాపురం మరిడిమాంబ ఆలయం వరకు ఈ యాత్ర సాగింది. మధ్యలో గాజువాక ఆర్టీసీ డిపో వద్ద డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్కే పురంలో ఎన్టీఆర్ విగ్రహానికి అంజలి ఘటించారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం ఎదురుగా గల గెడ్డ వద్దకు వెళ్లి సెల్ఫీ తీసుకున్నారు. మల్కాపురం వద్ద రహదారి విస్తరణకు చేపట్టిన శిలాఫలకం వద్ద మరో సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం 60వ వార్డు గుల్లలపాలెం వద్ద జరిగిన బహిరంగ సభ నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం రక్షణ కోసం గన్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేసుకుంటున్నారని, తాను కూడా గన్ కోసం లైసెన్స్ తీసుకుంటానని చెప్పారు. పేదలకు ప్రభుత్వం ఇస్తున్న సెంట్ భూమిలో ఎవరైనా ఉండగలరా? అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో యువత గంజాయికి బానిసలు అవుతున్నారన్నారు. అమ్మఒడి పేరుతో మహిళకు ఇస్తున్నదీ రూ.13 వేలు అయితే.. చెత్త పన్ను రూపంలో వారి నుంచి రూ.2 వేలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఈ యాత్రలో మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పల్లా శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ మహతి కళాశాలలో శుక్రవారం మ్యాజిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరగనుందని కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో డబ్ల్యూఎన్‌ఎస్, నవతా ట్రాన్స్‌పోర్టుతో సహ పలు సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ మేళాకు డిగ్రీ పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'


సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్న ఆడారి ఆనంద్ కుమార్

కంచరపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీఎంఎస్ ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 57వ వార్డు ఆశవానిపాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల వంటివన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని ప్రజలను కోరారు. పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముర్రు వాణి, సచివాలయ కన్వీనర్లు పల్లా ఎరికుమార్‌యాదవ్, దశావతారం, రాము, బుజ్జమ్మ నాయకులు శ్రీను, భోగేష్, జయలక్ష్మి, రాజు, పాలవేణి, సురేష్, ఎర్రన్న సత్యవతి, వెంకటి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అల్లిపురం: భర్తను హత్య చేసిన భార్యను మహారాణిపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ప్రకాష్‌రావుపేటలో చిత్తూరు రమణారావు, తన భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తున్నారు. రమణారావు నిత్యం మద్యం సేవించి..భార్యను హింసించేవాడు. మూడు రోజుల కిందట రమణారావు భోజనం చేస్తున్న మద్యం మత్తులో భార్యతో గొడవపడి.. ఆమెను చంపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె అందుబాటులోని సెల్ చార్జర్ వైరును అతని మెడకు గట్టిగా చుట్టడంతో రమణారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియలు చేసేందుకు చావుల మదుం శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. అక్కడ అతని మృతిపై అనుమానం వచ్చిన బంధువులు మహారాణిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించడంతో విషయం బయట పడింది. దీంతో హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరిపారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, డక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో 375 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ప్రతినిధి, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీ కాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18–27 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని వారు కోరారు.